క్లుప్తంగా

ఉత్సవాలకు ఆహ్వానం



ఆహ్వానం అందజేస్తున్న నాయకులు

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం పడకల్ గ్రామంలో కొనసాగుతున్న శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు.. రాష్ట్ర మత్స్య సహకార సమాఖ్య చైర్మన్ మెట్టు సాయికుమార్‌కు ఆలయ నిర్వాహకులు ఆహ్వానించారు. శనివారం నగరంలోని ఆయన నివాసంలో మాజీ సర్పంచ్ కాడమోని శ్రీశైలం, నాయకులు భిక్షపతి, రాజు కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.

వైభవంగా ఉత్సవాలు



పూజలందుకుంటున్న స్వామివారు

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం పడకల్ గ్రామం శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మూడో రోజు శనివారం స్వామివారికి ఆలయ అర్చకులు రామాచార్యులు ఆధ్వర్యంలో అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీశైలం, నాయకులు శంకర్, రవి, యాదయ్య, శ్రీను, జంగయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం చీపునుంతల గ్రామంలో రూ.15 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులను శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ఎస్‌డీఎఫ్ కింద రోడ్డు నిర్మాణానికి రూ.15 లక్షలు మంజూరయ్యాయని వారు వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు గుజ్జల మహేశ్, ఎస్సీసెల్ అధ్యక్షుడు చెన్నకేశవులు, నాయకులు వెంకట్‌రెడ్డి, వెంకట్‌రాజిరెడ్డి, కృష్ణయ్య, రఘుపతి, జంగయ్య, శ్రీశైలం, పెంటయ్య, మల్లేశ్‌గౌడ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం



వేంకటేశ్వర స్వామి ఆలయం

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి కమ్మగూడలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం, సత్యనారాయణ స్వామి సన్నిధిలో శనివారం వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. 17వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయని వ్యవస్థాపకుడు హనుమాన్ దీక్షితులు తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం క్షేత్ర పాలకుల ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించనున్నామని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

బీఆర్‌ఎస్ నాయకులపై ఫిర్యాదు



సీఐకి ఫిర్యాదు అందజేస్తున్న ఎన్‌ఎస్‌యూఐ నేతలు

ఇబ్రహీంపట్నం: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫొటోలను మార్ఫింగ్ చేసి, అభ్యంతరకరమైన రీతిలో సోషల్ మీడియాలో పోస్టు చేసిన బీఆర్‌ఎస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్‌యూఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఇబ్రహీంపట్నం సీఐ జగదీశ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు నందకిషోర్ మాట్లాడుతూ.. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో రేవంత్ ప్రతిష్టతను దెబ్బతీసేవిధంగా సామాజిక మాధ్యమాల్లో ఫొటోలు పెట్టడం దారుణమన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో కిషోర్‌తో పాటు ఆ సంఘం నేతలు అయ్యాన్, సచిన్, వెంకట్ ఉన్నారు.

లక్ష్యం.. నిర్లక్ష్యం

మిల్క్‌చిల్లింగ్ యంత్రాల్లో వినియోగించిన జలాలతో పాటు, నీటి వృథాను అరికట్టేందుకు ఏర్పాటు చేసిన ఈటీ ప్లాంట్ నిరుపయోగంగా మారింది. రూ.23 లక్షలు వెచ్చించి నిర్మించిన ఎఫిలియంట్ ట్రీట్‌మెంట్.. అధికారుల నిర్లక్ష్యానికి తుప్పుపట్టిపోయింది. ఫలితంగా లక్ష్యం నీరుగారిపోయింది.

- నిరుపయోగంగా ఈటీ ప్లాంట్
- నీటి వృథాను అరికట్టేందుకు ఏడేళ్ల క్రితం ఏర్పాటు
- పట్టించుకోని అధికారులు.. తుప్పుపట్టిన యంత్రం



నిరాదరణకు గురైన ఈటీ ప్లాంట్

కడ్తాల్: మండల కేంద్రంలోని పాలశీతలీకరణ కేంద్రంలో నీటి వృథాను అరికట్టేందుకు పాడిపరిశ్రమాభివృద్ధి పథకం, రాష్ట్రీయ కర్షక్ వికాస్ యోజన పథకం కింద 2017లో రూ.23 లక్షలతో ఈటీ ప్లాంటును ఏర్పాటు చేశారు. దీంతో కేంద్రంలోని మిల్క్ చిల్లింగ్ చేసే సమయంలో యంత్రాలకు ఉపయోగించిన నీటిని శుద్ధి చేయడంతో పాటు, మురుగు సమస్యకు చెక్ పెట్టేందుకు శ్రీకారం చుట్టారు. రీసైక్లింగ్ చేసిన నీటిని ఇతర అవసరాలతో పాటు.. చెట్లు, గడ్డి పెంచేందుకు వినియోగించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. అలా నిత్యం 15 వేల లీటర్ల నీటిని శుద్ధి చేసి వినియోగించారు. నాలుగైదు సంవత్సరాలు ప్లాంట్‌ను ఉపయోగించారు. ఆ తరువాత నిర్లక్ష్యం చేయడంతో ఆ యంత్రం తుప్పుపట్టిపోతోంది.

నిత్యం 30వేల లీటర్లు

మండల కేంద్రంలో ఆరున్నర దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన పాలశీతలీకరణ కేంద్రం.. అత్యధిక పాల ఉత్పత్తిలో సమైక్య రాష్ట్రంలోనే పేరు ప్రఖ్యాతులు పొందింది. ప్రస్తుతం నిత్యం 30వేల లీటర్ల వరకు పాల సేకరణ జరుగుతోంది. మండలంతో పాటు, కేశంపేట్, తలకొండపల్లి, ఆమనగల్లు, మాడ్గుల, కందుకూర్ తదితర మండలాల నుంచి 100కు పైగా సొసైటీల నుంచి సేకరించిన పాలను.. ఈ కేంద్రంలో చిల్లింగ్ చేస్తారు. ఈ సమయంలో.. యంత్రాలకు పెద్ద మొత్తంలో నీటిని వాడుతుంటారు. అలా వాడిన నీరు.. మురుగు జలాలుగా మారి వెలుపలికి వస్తుంటాయి.

తీవ్ర దుర్వాసన

గతంలో మండల కేంద్రంలో నివాసాలు పెద్దగా లేక పోవడంతో మురుగు జలాలను అలాగే వదిలేసేవారు. పదేళ్ల క్రితం కేంద్రం సమీపంలోనే పాఠశాలను ఏర్పాటు చేయగా.. వ్యర్థ జలాలతో వస్తున్న దుర్వాసనతో విద్యార్థులు ఇబ్బంది పడేవారు. ఇదే విషయమై పలుమార్లు ఉపాధ్యాయులు అప్పట్లో మేనేజర్, స్థానిక ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేశారు. దీంతో పాలశీతలీకరణ కేంద్రం నుంచి పాఠశాల మీదుగా కుంటకు మురుగునీటిని తరలించేందుకు పైప్‌లైన్ వేశారు. ఆ లైన్ తరచూ పేరుకుపోయి తీవ్ర దుర్వాసన వచ్చేది. అది భరించలేనంతగా ఉండటంతో.. అధికారులు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో 2017లో ఈటీ ప్లాంట్ ఏర్పాటును ఏర్పాటు చేశారు.



మురుగు నీటిని శుద్ధి చేస్తున్న ప్లాంట్ (ఫైల్)

చర్యలు తీసుకోవాలి

పాలకేంద్రంలో వాడిన నీరు వృథా కాకుండా శుద్ధి చేసి, ఇతర అవసరాలకు వినియోగించాలని స్థానికులు, పాడి రైతులు కోరుతున్నారు. ఈటీ ప్లాంట్ నుంచి వచ్చే నీటితో పాల కేంద్రంలో చొప్ప, గడ్డి సాగు చేయాలని, మొక్కలకు నీటిని అందించాలని పేర్కొంటున్నారు. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని విన్నవిస్తున్నారు.

వర్గీకరణ తరువాతే ఉద్యోగాల భర్తీ

ఆమనగల్లు: ఎస్సీ వర్గీకరణ చేసిన తరువాతే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని, మాదిగలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి కృష్ణమాదిగ డిమాండ్ చేశారు. వర్గీకరణ చేయాలని డిమాండ్ చేస్తూ తలకొండపల్లి మండల కేంద్రంలో సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష శనివారం ఐదో రోజుకు చేరుకుంది. దీక్షా శిబిరాన్ని సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి జ్యోతయ్య ప్రారంభించారు. శిబిరంలో నాయకులు బాలస్వామి, రాములు, శివ, పెంటయ్య, ప్రదీప్, మహేశ్, శంకరయ్య, జగన్‌లు కూర్చున్నారు.



దీక్షలో కూర్చున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కార్యక్రమంలో సమితి నాయకులు కుమార్, నారాయణ, సంపత్, మహేశ్, శేఖర్, సురేశ్, జంగయ్య, గిరి, ఉపేందర్ పాల్గొన్నారు.

అంబలి కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి

కడ్తాల్: రాగి అంబలి కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి అన్నారు. రంజాన్ సందర్భంగా శనివారం మండల కేంద్రంలో మహ్మద్ బాసిత్‌అలీ– ఖైరున్నీసా బేగం జ్ఞాపకార్థం వారి కుమారులు ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఏటా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బాటసారుల కోసం అన్నదానం, అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. జావ తీసుకోవడం వలన చల్లదనంతో పాటు, పౌష్టికాహారం అందుతుందని చెప్పారు. కార్యక్రమంలో జహంగీర్‌అలీ, లాయఖ్‌అలీ, అజ్గర్‌అలీ, ఆసీఫ్‌అలీ, హిమాయత్‌అలీ, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి,



బాటసారులకు జావ అందజేస్తున్న లయన్ సభ్యులు

క్లబ్ సభ్యులు గోవర్ధన్‌రెడ్డి, రాజేందర్ యాదవ్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, నాయకులు నేతిప్రభు, లింగం, ఇమ్రాన్‌బాబా, లక్ష్మయ్య ఉన్నారు.

ఘనంగా కాన్షీరాం జయంతి



ఆమనగల్లు: కాన్షీరాం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

ఆమనగల్లు: బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరాం జయంతిని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం డీఎస్పీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అందే విధంగా ధర్మ సమాజ్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం జరుపుకొన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు రమేశ్, బాలరాం, హరి, మహేశ్, సురేశ్, యాదగిరి, శ్రీశైలం, జంగయ్య, నాగేశ్ పాల్గొన్నారు.



తుర్కయంజాల్‌లో.. బీఎస్పీ నాయకులు

తుర్కయంజాల్‌లో..

తుర్కయంజాల్: బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరాం జయంతిని ఇంజాపూర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు పట్నం రమేష్, ఉపాధ్యక్షుడు రాజులు మాట్లాడుతూ.. రాజకీయాలకు దూరంగ ఉన్న వర్గాలకు సైతం పదవులు దక్కేలా చేసిన ఘనత కాన్షీరాం దేనని కొనియాడారు. రఘు, డాక్టర్ యడవల్లి శ్యామ్, రమణ, సైదులు, బాలకృష్ణ పాల్గొన్నారు.

ఫ్యూచర్ సిటీలో కలిపేందుకు కృషిచేస్తా

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

కందుకూరు: ఫ్యూచర్ సిటీలో చేర్చాలని కోరుతున్న గ్రామాల వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కలిపేలా తనవంతు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ హామీ ఇచ్చారు. ఫ్యూచర్ సిటీలో తమ గ్రామాలను చేర్చాలని కోరుతూ మండల పరిధిలోని నేదునూరు, బాచుపల్లి, జైత్వారం, ధన్నారం, పులిమామిడి, చిప్పలపల్లి, మురళీనగర్, దావూద్‌గూడ, పెద్దమ్మతండాలకు చెందిన అఖిల పక్ష నాయకులు శనివారం ఐటీశాఖ మంత్రి శ్రీధర్ బాబును కలవడానికి మినిస్టర్ క్వార్టర్లకు వెళ్లారు. కాగా అసెంబ్లీ సమావేశాల కారణంగా ఆయన వారితో కలవలేదు. అక్కడికి వచ్చిన మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ వారితో మాట్లాడారు. ఆయా గ్రామాల అభిప్రాయాన్ని మంత్రితో పాటు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఫ్యూచర్ సిటీలో కలిపేలా చూస్తానని వారికి ఆయన హామీనిచ్చారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.



అఖిలపక్ష నాయకులతో మాట్లాడుతున్న కేఎల్లార్

అంగన్‌వాడీల ధర్నాను జయప్రదం చేయండి

సీపీఎం మండల కార్యదర్శి శేఖర్



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న శేఖర్, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు

మహేశ్వరం: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 17, 18 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కలెక్టరేట్ల ఎదుట నిర్వహిస్తున్న ధర్నా, వంటావార్పు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఏర్పుల శేఖర్ కోరారు. శనివారం మండల కేంద్రంలో సీడీపీఓ ప్రాజెక్టు కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లతో కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యల పరిష్కారం కోసం సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా, వంటావార్పు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే పీఎం శ్రీ పథకాన్ని, మొబైల్ అంగన్‌వాడీ సెంటర్లను వెంటనే రద్దు చేయాలని, కేంద్ర ప్రభుత్వం తెచ్చిన విద్యా విధానం చట్టాన్ని అమలు చేయకుండా ఆపాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ఆయా నిరసన కార్యక్రమాల్లో ప్రతీ అంగన్‌వాడీ టీచర్, హెల్పర్లు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అంతకుముందు మండల కేంద్రంలో ఐసీడీఎస్ కార్యాలయంలో అధికారులకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

వైభవంగా సూరమాంబ బోనాలు

తుక్కుగూడ: పుర పరిధిలోని రావిర్యాల సూరమాంబ కంఠమహేశ్వరస్వామి ఆలయ ప్రథమ వారికోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం వైభవంగా బోనాల ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూజకాలు, పోతరాజుల విన్యాసాల మధ్య ప్రజలు బోనంతో ఊరేగింపు ద్వారా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం స్వామివారికి నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. తీర్థప్రసాదాలను స్వీకరించారు.



బోనాల ఊరేగింపు

కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

జగదీశ్‌రెడ్డి బర్తరఫ్ చేయాలి

మంచాల: బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన మోసాలను ప్రజలు గుర్తించి, సరైన బుద్ధి చెప్పారని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు గుడ్డిమల్ల చంద్రయ్య ముదిరాజ్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ నాయకులు అధికారంలో ఉన్నామనే భ్రమలో ఇష్టానుసారంగా మాట్లాడతున్నారని విమర్శించారు. దళితుడిని ముఖ్యమంత్రి చేస్తామని ఎన్నికల్లో వారి ఓట్లు దండుకుని, గెలిచిన తరువాత దళితున్ని కనీసం మంత్రిగానూ ఉండనీయలేదని ఆరోపించారు. దళితబంధు పేరుతో వారి జీవితాల్లో వెలుగులు నింపుతామని, నమ్మించి మోసం చేసిన విషయం ప్రజలు మర్చిపోలేదన్నారు. నేడు అదే పార్టీకి చెందిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి.. దళిత స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజమన్నారు. స్పీకర్‌ను అవమానించిన ఎమ్మెల్యేను వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

ఇందిరమ్మ ఇళ్లపై.. స్పష్టత కరువు

యాచారం: అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదని సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ అన్నారు. ఇళ్లు ఎప్పుడు మంజూరు చేస్తారోనని పేదలు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, రైతుబంధు, రైతుభరోసా తదితర పథకాలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పోరుబాటకు సిద్ధమవుతామని పేర్కొన్నారు. ఉపాధి కూలీలకు ప్రతివారం వేతనాలు అందేలా చూడాలని అధికారులను కోరారు. వేతనాలు సకాలంలో ఇవ్వకపోవడంతోనే ఉపాధి పనులపై కూలీలు ఆసక్తి చూపడం లేదన్నారు.

అన్నదానం.. మహాదానం

షాద్‌నగర్‌రూరల్: అన్ని దానాల్లో అన్నదానం గొప్పదని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్ అన్నారు. శనివారం పట్టణంలోని విజయ్‌నగర్ కాలనీలో ఉన్న అన్నపూర్ణాలయంలో కాంగ్రెస్ నాయకుడు జాంగారి రవి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బాల్‌రాజ్‌గౌడ్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



రేషన్ కార్డు మంజూరు పత్రం అందజేస్తున్న నాయకులు

మంచాల: అర్హులందరికీ సంక్షేమ పథకాలు ప్రభుత్వం అందజేస్తుందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధి ఆరుట్ల గ్రామంలో కొత్త రేషన్ కార్డు మంజూరు పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. మండలంలో 755 మందికి కొత్తగా రేషన్ కార్డులు మంజూరు అయ్యాయని తెలిపారు. గత ప్రభుత్వం అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందించడంలో విఫలమైందని, రేషన్ కార్డులు కూడా ఇవ్వలేదని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరి ఎల్లేష్, చెరుకు నర్సింహ, కృష్ణ, బుగ్గరాములు, అంతటి రాజు, మార సురేష్, బాషయ్య, రమేష్, చంద్రయ్య, వస్పరి కుమార్, శ్రీనివాస్‌గౌడ్, అశ్రఫ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు మార్కెట్ పాలకవర్గం ప్రమాణస్వీకారం

- హాజరుకానున్న ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్
- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సభావత్ కృష్ణానాయక్



మాట్లాడుతున్న కృష్ణానాయక్

మహేశ్వరం: మహేశ్వరం మార్కెట్ కమిటీ చైర్మన్ పాలకవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవం సోమవారం ఉదయం 8 గంటలకు నిర్వహించనున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ సభావత్ కృష్ణానాయక్ తెలిపారు. కార్యక్రమానికి ఐటీ పరిశ్రమల శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ హాజరవుతున్నారని పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో వారు సమావేశం నిర్వహించి మాట్లాడారు. మహేశ్వరం మండల పరిషత్ సమావేశ మందిరంలో మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణస్వీకారం అధికారుల సమక్షంలో నిర్వహిస్తామని తెలిపారు. ఉదయం 7 గంటలకు తుక్కుగూడ ఔటర్‌రింగ్ రోడ్డు ఎగ్జిట్ నుంచి మంత్రి, మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులతో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రమాణస్వీకారానికి నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, రైతులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చాకలి యాదయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కంబాలపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, మహేశ్వరం టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బంగరిగళ్ల లాజర్, నాయకులు చంద్రమోహన్, ఈశ్వర్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

18న ఉచిత కంటి వైద్య శిబిరం

తుక్కుగూడ: ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని దేవేంద్ర ఫౌండేషన్ సభ్యుడు తూళ్ల వీరేందర్ గౌడ్ అన్నారు. శ్రీనగర్‌లో శనివారం ఆయన మాట్లాడారు. 'మా నాన్న, హోం శాఖ మాజీ మంత్రి దేవేందర్‌గౌడ్ 73వ జన్మదినం సందర్భంగా' ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫీనిక్స్ ఫౌండేషన్, శంకర్ కంటి వైద్యశాల సౌజన్యంతో ఈ నెల 18న శ్రీనగర్‌లో వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగుతుందని, కంటి సమస్య ఉన్నవారు వైద్య సేవలను వినియోగించుకోవాలని కోరారు. వెంట ఆధార్ జిరాక్స్, ఫోన్ నంబర్ తెచ్చుకోవాలని సూచించారు.

సిబ్బంది లేక.. సమస్యలు తీరక

- మండల పరిషత్ కార్యాలయంలో అన్నీ ఖాళీలే!
- పరిష్కారానికి నోచుకోని సమస్యలు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు

మాడ్గుల: సిబ్బంది లేమితో ఎంపీడీఓ కార్యాలయం వెలవెలబోతోంది. ఫలితంగా వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు ఇబ్బంది తప్పడం లేదు. సకాలంలో పనులు గాక.. కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మాడ్గుల మండలంలో 34 గ్రామ పంచాయతీలున్నాయి. ఇంత పెద్ద మండల ప్రజలకు సేవలందించాల్సిన ఎంపీడీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్, ఆపరేటర్, టైపిస్ట్, వాచ్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉండటం శోచనీయమని మండల ప్రజలు పేర్కొంటున్నారు.

కష్టంగా కార్యాలయ నిర్వహణ

రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు చేస్తున్న విషయం విధితమే. అయితే పలు కారణాల వలన అర్హులకు సంక్షేమ పథకాలు అందడం లేదు. ఇలాంటి వాటి పరిష్కారం కోసం, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలన్న ఉద్దేశంతో ఎంపీడీఓ కార్యాలయంలో ప్రభుత్వం ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఇక్కడ దరఖాస్తు చేసుకుంటే.. సమస్యకు పరిష్కారం దొరుకుతుందన్న ఆశతో ప్రజలు బారులు తీరుతున్నప్పటికీ.. ఆపరేటర్ లేక పోవడంతో నిరాశతో వెనుతిరుగుతున్నారు. పనులు మానుకొని 10, 15కిలో మీటర్ల దూరం నుంచి వస్తే.. తమ సమస్యలకు పరిష్కారం దొరకడం లేదని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. అధికారులు, సిబ్బంది లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందిగా మారిందని, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రజా సౌకర్యార్థం ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా.. సూపరింటెండెంట్ లేక.. కార్యాలయ నిర్వహణ కష్టంగా మారిందని ఉద్యోగులు పేర్కొనడం గమనార్హం.



మండల పరిషత్ కార్యాలయం

జీతాలు రాక ఇబ్బంది

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్నాను. ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తూ ఆపరేటర్‌గా ప్రజలకు సేవలు అందిస్తున్నా. కానీ ఐదు నెలలుగా జీతాలు రాక ఇబ్బంది పడుతున్నాం. ఉన్నతాధికారులు స్పందించి సకాలంలో వేతనాలు వచ్చేలా చూడాలి.

– శివ, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి